
క్లుప్తంగా

ఘనంగా శాకంబరి ఉత్సవాలు



గూడూరు: మండల పరిధిలోని కంకటావ గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ అమ్మవారి శాకంబరి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో హిందూ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. పలు రకాల పండ్లు, పూల మొక్కలతో పాటు నీడను ఇచ్చే విలువైన మొక్కలను అందజేశారు. నగరానికి చెందిన వందలాది మంది ప్రజలు ఈ మొక్కలను తీసికెళ్లారు. మొక్కలను తీసికెళ్లేందుకు నగర ప్రజలు ఉత్సుకత చూపటంతో పంపిణీ ప్రాంతం రద్దీగా మారింది. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా పర్యవేక్షించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు



పెడన: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై బల్లిపర్రు సమీపంలో రెండు లారీలు ఎదురెదురుగా వస్తు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అమలాపురం మండలం నడుపూడి గ్రామానికి చెందిన ఐషెర్ వ్యాన్ లారీ డ్రైవరు భైరిశెట్టి నాగేశ్వరరావు (45), వీరులపాడు గ్రామానికి చెందిన మరో లారీ డ్రైవర్ రామశెట్టి రామకృష్ణ (44) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామకృష్ణ లారీకి క్లీనర్ బాషాకు ఎటువంటి గాయాలు కాలేదు. పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని నేరాలకు దూరంగా జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీరందక నోళ్లు తెరుస్తున్న భూములు

- చౌడు తేలుతున్న పంట భూములు
- ఎండుతున్న పైరు
- ఇంజిన్ల వినియోగంతో అదనపు భారం
- ఆందోళనలో అన్నదాతలు

బంటుమిల్లి: సాగునీరు అందక పంట భూములు నోళ్లు తెరుస్తున్నాయి. నాట్లు వేసేందుకు, వెదజల్లిన వరిమొక్కలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.

సమస్య ఇదీ..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగునీరు అందక వెద చల్లిన సార్వా వరి పైరు ఎండిపోతోంది. గత 15 రోజులుగా వర్షం కూడా లేకుండాపోయింది. పంట కాలువలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల కావటం లేదు. సాగునీరు శివారుకు చేరడం లేదు. బంటుమిల్లి ప్రధాన కాలువలో దాదాపు మూడు అడుగులకు నీటి మట్టం మించకపోవడంతో బ్రాంచి కాలువకు నీరు అందడంలేదు. దీనికి తోడు ఎగువ గ్రామాల రైతులు ప్రధాన కాలువలపైనే ఇంజిన్లు పెట్టి అడుగున ఉన్న నీటిని తోడుతుండటంతో దిగువకు నీరు సరఫరా కావడంలేదు.



పెందుర్రు కాలువ పరిధిలో భూమి నెర్రెలిచ్చి చౌడు పైకి తేలిన వరి పొలం



నారాయణపురం కాలువ పరిధిలో ఎండుతున్న వెద వరిపైరు

ఆదిలోనే ఇలా..

సార్వా సాగు ప్రారంభమై 20 రోజులు అవుతున్నా ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు ప్రస్తుతం బంటుమిల్లి ప్రధాన కాలువకు సుమారు 250 క్యూసెక్కులు మాత్రమే నీరు విడుదల అవుతోంది. ఈ నీరు కాలువలో మూడు అడుగుల లోపే ఉండటంతో బ్రాంచి కాలువలకు అందడంలేదు. దీంతో పలు బ్రాంచి కాలువల పరిధిలో వెద చల్లిన పంట పొలాల్లో పైరు ఎండిపోతూ భూమి నెర్రెలు ఇస్తోంది.

నీటి సరఫరా పెంచుతాం

దీనిపై బంటుమిల్లి సెక్షన్ ఏఈఈ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బంటుమిల్లి కాలువకు నీటి సరఫరా పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులు అత్యధికంగా వెద పద్ధతిని అవలంభించడంతో నీటి ఎద్దడి ఏర్పడిందని ఆమె చెప్పారు.

ఉప్పు తేలుతున్న పొలాలు

సాగునీరు పైరులో నిలవ లేకపోవడంతో నేలలోని ఉప్పు పైకితేలి భూములు తెల్లగా చౌడుతో కనిపిస్తున్నాయి. దీని కారణంగా పంట దిగుబడి తగ్గి పెట్టిన ఖర్చులు కూడా రావంటూ లక్ష్మీనారాయణపురం, పెందుర్రు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ప్రారంభంలోనే ఇంజిన్లతో సాగు చేయడమంటే ఎంతో ఖర్చుతో కూడిన పని అని, దానికన్నా సాగు విరమించుకోవడం మంచిదని పలువురు రైతులు వాపోయారు.

ముదురుతున్న వరినారు

చోరంపూడి, కంచడం, మల్లపరాజుగూడెం గ్రామాల పరిధిలో ఉన్న నారుమళ్లు పోసి దాదాపు నెల రోజులు అవుతున్న క్రమంలో దమ్ములకు నీరు లేక నారు ముదిరిపోతోంది. దీంతో రైతులు కాలువలకు అడ్డుకట్ట వేసి నీరు మళ్లించి దమ్ములు చేస్తూ నాట్లు చేపట్టారు. ఇది గ్రామాల మధ్య అంతర్గత గొడవలకు కారణమవుతోంది.



నారుమళ్లు కాపాడుకునేందుకు చోరంపూడి బ్రాంచి కాలువకు అడ్డుకట్ట వేసిన రైతులు

రాష్ట్రంలో రాక్షస పాలన

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కళ్యాణి

అవనిగడ్డ: ఎస్సీ, బీసీ వ్యతిరేకి చంద్రబాబు మార్గంలోనే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పయనిస్తూ బీసీ మహిళ అయిన కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై దాడి చేయడం హేయమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీసీ మహిళ, విద్యావంతురాలు, వివాదరహితులు అయిన హారిక, పెడన నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఉప్పాల రాముపై టీడీపీ, జనసేన గూండాలు దాడిచేయడం ఉన్మాద చర్యని దుయ్యబట్టారు. పోలీసుల ముందే గంటకు పైగా వారిని నిర్బంధించి తీవ్ర భయభ్రాంతులకు గురిచేశారంటే రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని అర్థమవుతోందన్నారు. రైతుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పర్యటనలకు విశేష ప్రజాదరణ లభిస్తుండటంతో కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై భౌతిక దాడులకు దిగుతున్నారని విమర్శించారు. ఇలాంటి దాడులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరని స్పష్టం చేశారు.

చర్యలు తీసుకోకుంటే ఉద్యమం: గౌడ సంఘం మహిళానేత

కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడికి పాల్పడిన టీడీపీ, జనసేన గూండాలపై చర్యలు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి హెచ్చరించారు. కూటమి పాలనలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పాల హారిక, ఉప్పాల రాముపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోడూరు ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏపీ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజులపాటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, రామచంద్రపురం సర్పంచ్ వాకా రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, బీసీ నాయకులు అవనిగడ్డ శ్రీనివాసరావు, జంపాన మురళి, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చింతలపూడి బాలు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులపై టీడీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని గూడూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ఎవరైనా ఖండించాలన్నారు. ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హారిక, రాము దంపతులకు పరామర్శ



హారికను పరామర్శిస్తున్న జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

పెడన: ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పరామర్శించి ఓదార్చి సంఘీభావం తెలిపి ధైర్యం చెప్పారు. మండల పరిధిలోని కూడూరు పంచాయతీ కృష్ణాపురం గ్రామంలోని రాము స్వగృహంలో హారిక, రాము దంపతులను కలిసిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, వైఎస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, జెడ్పీటీసీలు వేముల సురేష్ రంగబాబు (గూడూరు), మలిశెట్టి వెంకటరమణ (బంటుమిల్లి), మైలా రత్నకుమారి (కృత్తివెన్ను), కందుల దుర్గాకుమారి (నందివాడ), కొమరవల్లి గంగాభవాని (బాపులపాడు), వరికూటి ప్రతాప్ (ముసునూరు), బాకి కోటేశ్వరరావు (కంకిపాడు), వై.రామచంద్రారెడ్డి (తిరువూరు), జెడ్పీ వైస్ చైర్మన్లు శ్రీదేవి, గుడిమెట్ల కృష్ణంరాజు తదితరులు ఉన్నారు. ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల బేబీరాణి, ప్రధాన కార్యదర్శి రావులపల్లి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బోయిన సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొల్లి మర్ల సుధాకరరావు, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ పిన్నింటి మహేష్, ఆయా మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి పరామర్శించారు.

మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

నాగాయలంక: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ అరాచకాలకు పరాకాష్టగా టీడీపీ గూండాలు బడుగు, బలహీన వర్గాలపై వికృతంగా దాడులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక వాహనంపై శనివారం టీడీపీ శ్రేణులు జరిపిన దాడిని రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు, అవనిగడ్డ నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు బీసాబత్తుని ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. నిరంతరం గొప్పలు చెప్పుకునే కూటమి పాలకులు మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రెడ్‌బుక్ అరాచాకాలతో కాలకూట విషం కక్కుతున్నారన్నారు. ప్రజల హక్కులను ప్రభుత్వం ఏమాత్రం గౌరవించడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ జగనన్న ఆలోచనలకు ప్రజలు సర్వత్రా మద్దతు పలుకుతున్నారన్న అక్కసుతోనే కూటమి ప్రభుత్వ పాలకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యందు ఇలాంటి ఘటనలకు తావు లేకుండా రాష్ట్ర హోంమంత్రి, పోలీసుశాఖ చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

బీసీ మహిళపై దాడి హేయం

మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళా విభాగం నాయకులు



మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ చిత్రంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ మహిళ, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కూటమి గూండాలు దాడి చేయటం హేయమైన చర్య అని మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. కూటమి నాయకులు సంస్కారం లేకుండా మహిళపై దాడి చేయటం చూస్తే ఈ రాష్ట్రం ఎటుపోతుందో అర్థం కావటం లేదన్నారు. ఒక మహిళను అగౌరపరిస్తే నాశనానికి దారితీస్తుందన్నారు. తాను, తమ కుటుంబం 40 సంవత్సరాల నుంచి రాజకీయాలు చేస్తున్నామని, ఎన్నడూ ఇటువంటి రాజకీయాలు చూడలేదని పేర్కొన్నారు. బీసీ ఓటర్లు తమకే ఉన్నారని బాహాటంగా చెప్పుకునే టీడీపీ నాయకులు బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై దాడి చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ సమావేశానికి వెళుతుంటే గుడివాడ పట్టణంలో ఒక ఉన్నత పదవిలో ఉన్న మహిళపై దాడి చేయటం దారుణమన్నారు. ప్రతి మహిళా ఈ దాడులను గుర్తుపెట్టుకుని రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ బందెల కవిత మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించలేని హోంమంత్రి వనిత ఆ కుర్చీలో కూర్చోవటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్లు షేక్ షాహీనా, వాసంశెట్టి వాణిశ్రీ, గాజుల శ్రీదేవి, కొలుసు విజయగంగ, పలువురు కార్పొరేటర్లు, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలకు 115 మంది ఎంపిక



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ లిల్లీ జాయ్, సంస్థ ప్రతినిధులు



మచిలీపట్నం 34వ డివిజన్‌లో రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు భానుమూర్తి

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో స్థానిక సుదర్శి మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 54వ ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం జరిగింది. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో 123 మందికి డాక్టర్ లిల్లీజాయ్ కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 85 మందిని ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక బస్సులలో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్, మత్తి శివ, కనిగంటి అజయ్ తదితరులు శిబిరంలో రోగులకు సేవలు అందించారు.

200 మందికి నేత్ర పరీక్షలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 34వ డివిజన్ దేశాయిపేట గోల్డెన్ క్రాస్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 200 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర విభాగాధిపతి, ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జీ భానుమూర్తి రోగులకు వైద్య సేవలు అందించారు. 200 మందికి నేత్ర పరీక్షలు చేయగా వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. వీరికి ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేస్తామని వైద్యుడు భానుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ క్రాస్ చర్చి నిర్వాహకులు పాస్టర్ శ్యామ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ దెబ్బకు బోసిపోతున్న రోడ్లు



బంటుమిల్లి: మండలంలో గత వారం రోజులుగా కాస్తున్న ఎండలు రోహిణికార్తెను తలపిస్తున్నాయి. ఆదివారం దాదాపు 36 డీగ్రీలకుపైగా కాసిన ఎండ దెబ్బకి జనసంచారం నిలిచిపోయింది. మండుతున్న ఎండకు తోడు ఉక్కపోత కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. పగలు కాసిన ఎండ వేడికి రాత్రి 10 గంటల వరకు డాబాలు చల్లబడటంలేదు. సెలవు రోజులతో నిమిత్తం లేకుండా ప్రతిరోజు జనసంచారంతో సందడిగా ఉండే బంటుమిల్లి పాత బస్టాండు సెంటర్, సంతమార్కెట్టు వీధులు బోసిపోయాయి. ఎండ దెబ్బకు ప్రజలు బయటకు రాకపోవడంతో దుకాణాలు వెలవెలపోయాయి. ఆదివారమైనా దుకాణాలు తెరిచి ఉంచే వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

వెండి చెంబు ఇస్తేనే కుట్టుమిషన్

- ఫేర్‌వెల్ ఫంక్షన్ పేరిట శిక్షణ పొందే వారి నుంచి వసూళ్లు
- సంబంధం లేదంటున్న బీసీ కార్పోరేషన్ అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు జిల్లాలో పలు ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రాలకు సంబంధించి శిక్షణ ఏజెన్సీ ద్వారా కొందరికి శిక్షణ ఇచ్చి ఆ కేంద్రాల్లో శిక్షకురాళ్లుగా నియమించారు. వీరు ప్రతి రోజూ మహిళలకు కుట్టుమిషన్లపై మూడు నెలలు శిక్షణ ఇస్తారు. అనంతరం మిషన్లు అందజేస్తారు.

సమస్య ఇదీ..

మచిలీపట్నం నగరంలోని ఈడేపల్లి ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో శిక్షకురాలు చేతివాటం ప్రదర్శిస్తోందని శిక్షణ పొందే మహిళలు ఆరోపిస్తున్నారు. శిక్షణ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ మహిళలకు ఎటువంటి శిక్షణ ఇవ్వకపోవటం ఒక ఎత్తైతే, ఆ శిక్షణ పొందే వారి నుంచి ఫేర్‌వెల్ ఫంక్షన్ పేరుతో 140 మంది నుంచి రూ.42 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సొమ్ముతో తనకు వెండి చెంబు బహుమతిగా ఇవ్వాలని శిక్షకురాలు హుకుం జారీశారు. ఎవరు ఇవ్వకపోయినా కుట్టు మిషన్ వచ్చేది లేదని ఆమె తెగేసి చెప్పటంతో శిక్షణ పొందే మహిళలు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ శిక్షకురాలు అడిగిన విధంగా ప్రతి ఒక్కరూ వారి వాటా కింద రూ.300 ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించుకుందాం ప్రతి ఒక్కరూ తప్పకుండా రావాలని ఆమె గ్రూప్‌లో వాయిస్ మెసేజ్‌లు పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయంపై బీసీ కార్పొరేషన్ అధికారులను ప్రశ్నిస్తే కుట్టు శిక్షకురాలు తమ పరిధిలోకి రాదని అది ఏజెన్సీల నుంచి నియమించారని వివరణ ఇచ్చారు.

వసూలు చేస్తే ఇచ్చేయమన్నాం

ఏజెన్సీ జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మిని వివరణ కోరగా శిక్షకురాలు ఎటువంటి నగదు వసూలు చేయలేదని, శిక్షకురాలి బంధువులు ఆసుపత్రిలో ఉండటంతో సెలవులో ఉన్నట్టు తనకు చెప్పిందని లక్ష్మి వివరించారు. నగదు వసూలు చేస్తే తిరిగి వెనక్కి ఇవ్వాలని సూచించానని తెలిపారు.

నిరూపిస్తే.. రాజీనామాకు సిద్ధం

వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పాల రాము

పెడన/కృత్తివెన్ను: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు తన వలన గుడివాడలో అల్లర్లు జరిగాయని మంత్రి రవీంద్ర ఆరోపిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. తామే ఆ అల్లర్లకు కారణమని మంత్రి నిరూపిస్తే జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా ఇస్తామని ఆయన ఛాలెంజ్ చేశారు. ఆదివారం పెడనలో 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' పేరిట నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశాన్ని ఉప్పాల రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ వ్యవస్థ అంతా మంత్రి చేతిలోనే ఉందని, తమపై చేసిన ఆరోపణలు నిరూపించాలన్న తన ఛాలెంజ్‌ను ఆయన స్వీకరించాలన్నారు. ఒక ఆడపిల్లపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. తాము బీసీలం కాదని చెప్పే మంత్రి బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. నటిస్తున్నామని మంత్రి మాట్లాడటం అన్యాయమన్నారు. తమకు ముక్కు సూటి రాజకీయాలే వచ్చని, నటించటం తెలియదన్నారు. గతంలో కూడా కొల్లు కుట్ర చేసి తమ వ్యాపారాలను రోడ్డు మీద పడేశారన్నారు. అప్పట్లోనే తాము లెక్క చేయకుండా నమ్ముకున్న పార్టీ కార్యకర్తల కుటుంబాల కోసం పాటు పడ్డామన్నారు. ఈ కట్టె కాలేంత వరకు రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. గుడివాడలో వైఎస్సార్ సీపీ జెండా పట్టుకునేవాళ్లు లేకుండా ఉండటానికే ఇదంతా చేస్తున్నారని అన్నారు. 7, 8 నెలల్లో కొడాలి నాని ఆరోగ్యం బాగుపడి అదే గుడివాడలో పార్టీని బలపరిచేందుకు వస్తారన్నారు. అపుడు తామంతా ఆయన వెనుక నిలబడతామని చెప్పారు. తమ కుటుంబానికి తమ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఫోన్ చేశారన్నారు. భయపడకుండా తమను ముందుకు వెళ్లమన్నారని, పార్టీ పెద్దలంతా తమ వెనుక ఉంటారని చెప్పారని తెలిపారు. అవసరమైతే కోర్టులకు అయినా వెళ్లి న్యాయ పోరాటం చేద్దామని ఆయన చెప్పారన్నారు. తమతో పాటు కార్యకర్తల్ని కూడా ఆయన కంటికి రెప్పలా కాపాడుకుంటారని హామీ ఇచ్చారు. ఈ నెల 14, 15వ తేదీల్లో మండల స్థాయి పార్టీ సమావేశాలు ఉంటాయన్నారు. 24 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు రచ్చబండ సమావేశాలను ఏర్పాటు చేసి గ్రామ, బూత్ లెవల్ కమిటీలను గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక మహిళను వ్యక్తిగతంగా దూషణలు చేసి, రెండు గంటల పాటు తమ కారును నిలిపి వేసి దాడి చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోక పోవటం అన్యాయమన్నారు. దాడికి కారణమైన టీడీపీ గూండాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మహిళలపై జరుగుతున్న దాడులను మంత్రి రవీంద్ర ప్రోత్సహిస్తున్నారన్నారు. తానేదో చేయటం వలన అల్లర్లు జరిగాయని ఆరోపిస్తున్న మంత్రి తన ఇంట్లో భార్యకో, తల్లికో ఆ మాటను చెప్పాలన్నారు. తమపై దుష్ప్రచారం చేసే మంత్రి ఇంట్లో కూడా మహిళలు ఉంటారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. తమపై దాడి చేయించిన ప్రభుత్వం తమపై అభాండాలు వేసేందుకు మంత్రి రవీంద్రను వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.2.50 లక్షలు బాకీ

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మచిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కిట్టు మాట్లాడుతూ నెరవేర్చని హామీలను పవన్, బాబు సంతకాలతో ఇచ్చిన బాండ్లపై ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఆ బాండ్లలో చెప్పిన విధంగా ఒక్కో కుటుంబానికి ఇప్పటికి సంక్షేమ పథకాల పరంగా కూటమి సర్కార్ రూ.2.50 లక్షలు బాకీ పడిందన్నారు. ఒక మహిళపై దాడి చేసి ఆమె మీదే మంత్రి కొల్లు మాటలతో ఎదురు దాడికి దిగుతున్నారని చెప్పారు. ఇకపై జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి చేయాలంటే తమ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకుల కుటుంబాన్ని దాటి రావాలని హెచ్చరించారు. ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కైలే అనిల్‌కుమార్, దేవభక్తుని చక్రవర్తి, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి బి.గురున్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, బూరగడ్డ శ్రీకుమార్, ఎంపీపీలు గరుడప్రసాద్, సంగా మధుసూదనరావు, వాణి, జెడ్పీటీసీలు రత్నకుమారి, వెంకటరమణ, సురేష్‌రంగబాబు, సీనియర్ కౌన్సిలర్లు, పార్టీ మండల అధ్యక్షులు దావుభైరవలింగం, ముత్యాల నాగేశ్వరరావు, జల్లాభూపతి, కర్నా శ్రీనివాసరావు, సమ్మెట శ్రీనివాసరావు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తిరుమాని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెరటితోట కూరలతో ఆరోగ్యం

జూనియర్ సివిల్ జడ్జి భాస్కరరావు



కూరగాయల మొక్కలు పంపిణీ చేస్తున్న జడ్జి భాస్కరరావు

బంటుమిల్లి: పెరట్లో పెంచుకుని ఉపయోగించే కూరగాయలు ఆరోగ్యాన్ని ఇస్తాయని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆదివారం డాక్టరు అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెరటి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు సీహెచ్.గంగాజలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ చేపట్టిన మంచి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలన్నారు. వృద్ధుల సంరక్షణ చట్టం, వృద్ధులు రాసే దఖలు చట్టాల ద్వారా సత్వర న్యాయం పొందేందుకు ట్రిబ్యునల్‌ను ఏలా ఆశ్రయించాలో అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్యాంబాబు, సీనియర్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, కే.రాంబాబు, ఈవీఎస్ రాయుడు, వృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు జే. భాస్కరరావు, కే.నాగభూషణం, ఎస్.జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామంలో నాలుగు చోట్ల చోరీలు

ఉయ్యూరు రూరల్: మండలంలోని ఆకునూరు గ్రామంలో శనివారం రాత్రి నాలుగు చోట్ల చోరీలు జరగడం కలకలం రేపాయి. ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గారపాటి కోటేశ్వరావు ఈ నెల 6వ తేదీన కాశీ యాత్రకు వెళ్లారు. తిరిగి 12 వ తేదీ ఉదయం తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉంది. బీరువా తాళాలు సైతం పగలగొట్టి ఉన్నాయి. రూ.700 చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సురేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీ జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఇంటి యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి తోడు అదే గ్రామంలో చోరీకి గురైన నివాసానికి దగ్గరలో ఉన్న మాజీ సర్పంచ్ కాకాని విజయ్ కుమార్ ఇంటి తోపాటు రైతు భరోసా కేంద్రం, అక్కడికి దగ్గరలో ఉన్న ఓ ఆర్ఎంపీ వైద్యుని వైద్యశాలల తాళాలు దుండగులు పగలగొట్టారు. దీంతో వరుస నాలుగు చోట్ల చోరీలు జరిగినట్లుగా గుర్తించారు. వైద్యశాలలో 1200 రూపాయలు చోరీకి గురైనట్లు తెలిపారు. దీంతో ఒకే గ్రామంలో వరసగా ఒకేరోజు నాలుగు చోట్ల దొంగతనం జరగడంపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.